క్లుప్తంగా

హుండీ లెక్కింపు ద్వారా రూ.33.64లక్షల ఆదాయం



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీ ద్వారా రూ.33.64 లక్షల ఆదాయం వచ్చిందని ఏసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో గురువారం హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ లెక్కింపులో నగదుతోపాటు 11 గ్రాముల బంగారం, 522 గ్రాముల వెండి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొమరగిరి రవీంద్రభరద్వాజ్, పాలకవర్గ సభ్యులు చింతల నరసింహారావు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రూపాబాయమ్మ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ ప్రతిష్ట



గౌరవరం(జగ్గయ్యపేట): గ్రామంలో నూతనంగా నిర్మించిన ఏకశిల ముత్యాలమ్మ అమ్మవారి ప్రతిష్ఠా మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించి శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. ప్రత్యేక హోమాలు చేశారు. ప్రతిష్ఠా మహోత్సవాల్లో జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను పాల్గొని పూజలు చేశారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

ఖోఖోలో రన్నర్స్‌గా మిక్ కళాశాల జట్టు



కంచికచర్ల : ఈనెల 19నుంచి 21వతేదీ వరకు కేఎల్ యూనివర్సిటీలో జరిగిన కేఎల్ మెమోరియల్ ఆటలపోటీల్లో కంచికచర్ల మిక్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఖోఖోలో రన్నర్స్‌గా నిలిచారు. ఖోఖోలో ద్వితీయ బహుమతిని గెలుచుకున్న కళాశాల క్రీడాకారులకు గురువారం అభినందించారు. ఈసందర్భంగా కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నిమ్మగడ్డ శౌరయ్య మాట్లాడుతూ ఖోఖో జట్టు విజయానికి కృషి చేసిన నాగరాజు, నవీన్‌కృష్ణ, కృష్ణారావులతోపాటు క్రీడాకారులను అభినందించారు. క్రీడాకారులను అభినందించినవారిలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టీ వంశీకిరణ్, ఆయా విభాగాల అధ్యాపకులు ఉన్నారు.

కల్యాణోత్సవాలకు పటిష్ట బందోబస్తు



పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవం సందర్భంగా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నందిగామ ఏసీపీ డాక్టర్ రవికిరణ్ తెలిపారు. జగ్గయ్యపేట సీఐ జానకిరామ్, పెనుగంచిప్రోలు ఎస్ఐ పి.రాంబాబుతో కలిసి గురువారం రాత్రి ఆయన పెనుగంచిప్రోలులోని స్వామివార్ల కల్యాణ వేదికను పరిశీలించారు. పార్కింగ్ స్థలాన్ని పరిశీలించి, ఆలయ సిబ్బందితోపాటు పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు.భక్తులకు ఇబ్బంది లేకుండా బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఏసీపీ వివరించారు. ఏసీపీ వెంట ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు ఉన్నారు.

వైభవంగా కల్యాణోత్సవాలు



నందిగామ: స్థానిక మెయిన్‌బజారులో వేంచేసియున్న శ్రీశుక శ్యామలాంబ సమేత రామలింగేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. స్వామివారికి గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని పార్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. రాత్రి సమయంలో స్వామివారి ఎదురుకోలోత్సవం కన్నుల పండువగా సాగింది. అనంతరం స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి, రామలింగేశ్వరస్వామి వారి కల్యాణాన్ని తిలకించారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



కంచికచర్లలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు, అధికారులు, నాయకులు

కంచికచర్ల : వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ఐదుగురికి సేవారత్న, 337మందికి సేవామిత్ర అవార్డులను అందజేసి ఘనంగా సత్కరించారు సేవారత్న అవార్డు కింద ఒక్కొక్కరికి రూ.30వేలు, సేవామిత్ర అవార్డు కింద ఒక్కొక్కరికి రూ.15వేల నగదు బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను అందిస్తున్నారన్నారు. ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలందించేందుకు సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి రాజనీతిని ప్రదర్శించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన వలంటీర్ వ్యవస్థను ప్రధాని నరేంద్రమోడీ సైతం మెచ్చుకున్నారని గుర్తుచేశారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రభుత్వానికి మంచిపేరు వస్తుండటంతో ప్రతిపక్షాలు ఓర్వలేక నిందలు వేస్తున్నాయని ఆరోపించారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా వలంటీర్లు చేసిన సేవలు మరువలేనివన్నారు.ప్రతి వలంటీర్‌కు ప్రభుత్వం రూ.10లక్షల బీమా సదుపాయం కల్పించినట్లు వివరించారు. కార్యక్రమానికి ఎంపీడీవో అత్తోట దీప్తి అధ్యక్షత వహించగా, జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, వైస్ ఎంపీపీలు బండి మల్లికార్జునరావు, వెలగలేటి మాధవి, సర్పంచి వేల్పుల సునీత, నాయకులు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు, మాడుగుల మధుబాబు, మాడుగుల శంకర్, వేల్పుల శ్రీనివాసరావు, మార్త శ్రీనివాసరావు, మంగలపూడి కోటిబాబు, బుడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. తమ సేవలకు గుర్తింపుగా రాష్ట్రప్రభుత్వం ఏటా అవార్డులు, నగదు ప్రోత్సాహకాలను అందిస్తుండటంతో అవార్డు గ్రహీతలైన వలంటీర్లు హర్షం వ్యక్తంచేస్తున్నారు. వలంటీర్ల అభిప్రాయాలు వారి మాటల్లోనే...



హాజరైన వలంటీర్లు

మెరుగైన సేవలందిస్తా..



ప్రభుత్వం నా సేవలను గుర్తించి సేవారత్న పురస్కారం అందించడం సంతోషంగా ఉంది. అవార్డుతోపాటు రూ.30వేలు ప్రోత్సాహం అందించారు. రానున్న రోజుల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తాను. మమ్మల్ని ప్రోత్సహిస్తున్న సీఎం జగనన్నకు, ఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు కృతజ్ఞతలు.

– నెమలపురి వరలక్ష్మి, పరిటాల

ప్రజాసేవ సంతృప్తినిస్తోంది..



ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు మాచేతుల మీదుగా అందిస్తుండటం సంతోషంగా ఉంది. నా పరిధిలో అర్హులందరికీ ఆయా పథకాలు, పౌరసేవలను సకాలంలో అందిస్తున్నాను. నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయడం సంతృప్తి నిస్తోంది.

– దోలు స్వప్న, కంచికచర్ల

సంతోషంగా ఉంది..



ప్రతినెలా ఒకటో తేదీ ఉదయాన్నే పింఛన్ పంపిణీ చేసే సమయంలో లబ్ధిదారులు చూపించే ఆప్యాయత, వారి సంతోషం చూసి మాకు చాలా సంతృప్తిగా ఉంటోంది. మా కష్టాన్ని గుర్తించి అవార్డులతో ప్రోత్సహిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావుకు ప్రత్యేక ధన్యవాదాలు.

– వెలగలేటి లక్ష్మి, చెవిటికల్లు

ఓటుతో జగనన్నకు అండగా నిలవాలి

ప్రజలకు ఎమ్మెల్యే పిలుపు



మొగులూరులో గ్రామస్తులు సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

మొగులూరు(కంచికచర్ల): తమ వైఎస్సార్ సీపీ ప్రభుత్వహయాంలో మీకు మంచి జరిగితేనే రానున్న ఎన్నికల్లో ఓటు వేయడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి అండగా ఉండాలని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని మొగులూరులో గురువారం ఆయన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వం అమలుచేస్తున్న ఆయా పథకాల క్యాలెండర్‌ను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులందరికీ ఆయా పథకాలను అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రైతును రారాజుగా చేస్తున్న ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పార్టీకి ఓట్లేసి గెలిపించాలన్నారు. జగనన్నను మరోసారి సీఎంగా చూడాలని, ప్రజలంతా ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచి షేక్ మొహిద్దీన్‌బీ, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, ఎంపీటీసీ సభ్యులు ఆవుల సామ్రాజ్యం, గ్రామ పార్టీ కన్వీనర్ బండి సూరిబాబు, మాజీ సర్పంచి షేక్ హుస్సేన్, బండి తిరుపతిరావు, రాయల నరహరి, షేక్ రసూల్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, వీఆర్వో శ్రీలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉదయభానును కలసిన గోపికృష్ణ



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానును వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన రామిశెట్టి గోపికృష్ణ(మిల్లు గోపి)గురువారం రాత్రి కలిశారు. తన నియామకానికి సహకరించారంటూ ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం రామిశెట్టి గోపికృష్ణను ఉదయభాను సత్కరించి అభినందించారు.

ఉత్సవాలకు నూతన రథం సిద్ధం



నందిగామ: పట్టణంలోని రామలింగేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాల్లో రథోత్సవానికి ప్రత్యేక స్థానం ఉంది. ఏటా మాఘ మాసంలో స్వామివారి కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. కల్యాణోత్సవం అనంతరం మాఘపౌర్ణమి రోజున నందిగామలో రథోత్సవం నిర్వహించడం సంప్రదాయం. స్వామివారి రథం దెబ్బతినడంతో గతేడాది తాత్కాలికంగా నూతన రథాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంవత్సరం ఎట్టి పరిస్థితులలోనూ భక్తుల మనోభావాలు దెబ్బతిన కూడదన్న సంకల్పంతో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. దాదాపు రూ.35లక్షలతో నూతన రథాన్ని ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. 25అడుగుల ఎత్తులో నలుమూలల 50కి పైగా పలు దేవతామూర్తుల ప్రతిమలు, శివగణాలతో నూతన రథాన్ని సిద్ధం చేయిస్తున్నారు. కొద్దిరోజులుగా రథం తయారుచేసే కళాకారులు నందిగామ పట్టణంలోనే ఉంటూ రథాన్ని సిద్ధం చేస్తున్నారు. ప్రత్యేక పూజల అనంతరం శుక్రవారం రాత్రి స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఈరథం ఏర్పాటు పనులను ఎమ్మెల్సీ అరుణకుమార్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

పెనుగంచిప్రోలు చేరుకుంటున్న దీక్షాపరులు



కాలినడకన పెనుగంచిప్రోలు చేరుకుంటున్న దీక్షాస్వాములు



జగ్గయ్యపేట నుంచి పెనుగంచిప్రోలు తరలివెళ్తున్న దీక్షాస్వాములు

పెనుగంచిప్రోలు: శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి స్వాములు దీక్ష విరమించి తిరుముడి సమర్పించేందుకు గురువారం ఉదయం నుంచే కాలినడకన పెనుగంచిప్రోలుకు చేరుకుంటున్నారు. స్వాములు వివిధ ప్రాంతాల నుంచి కాలినడకన, వాహనాల్లో గ్రామానికి పెద్దసంఖ్యలో చేరుకుంటుండగా, వారి కోసం ఆయా ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద శుక్రవారం రాత్రి జరిగే శ్రీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణానికి పెద్ద సెట్టింగులతో మండపాన్ని కళాకారులు తీర్చిదిద్దుతున్నారు. దీక్షాస్వాముల ఉచిత భోజనానికై మునేరు అవతల అమ్మవారి ఆలయానికి చెందిన మామిడితోటలో అధికారులు భోజన ఏర్పాట్లు చేశారు. అన్నదానానికి దాతలు సహాయ సహకారాలు అందించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్: శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారికి ఇరుముడి సమర్పించి దీక్షలను విరమించేందుకు జగ్గయ్యపేట పట్టణం నుంచి దీక్షస్వాములు గురువారం ఊరేగింపుగా పెనుగంచిప్రోలు బయలుదేరి వెళ్లారు. పట్టణంలోని శ్రీచంద్రమౌళీశ్వరస్వామి(పెద్ద శివాలయం)ఆలయం నుంచి రంగుల గురుస్వామి ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి దీక్షా మాలధారులు మేళతాళాలతో ఊరేగింపుగా పెనుగంచిప్రోలుకు బయలుదేరి వెళ్లారు.

సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల : గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తగిన నిధులు మంజూరు చేస్తోందని, ఆ నిధులతో అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. కంచికచర్లలో రూ.12లక్షలతో సీసీరోడ్ల నిర్మాణంతోపాటు విశ్వబ్రాహ్మణుల శ్మశానవాటికకు వెళ్లే రోడ్డు అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టామన్నారు. గ్రామాలకు మంచినీరు సరఫరా అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఎక్కడైనా సమస్య ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులను కోరారు. జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, సర్పంచి వేల్పుల సునీత, ఉపసర్పంచి వేమా సురేష్‌బాబు, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, ఎంపీడీవో అత్తోట దీప్తి, ఎంపీటీసీ సభ్యులు నన్నపనేని నరసింహారావు, మాడుగుల మధుబాబు, ఏఎంసీ వైస్‌చైర్మన్ మాడుగుల శంకర్, నాయకులు దేవరకొండ గురవయ్య, నారిశెట్టి శ్రీనివాసరావు, ఎం.పాండు, వేల్పుల శ్రీనివాసరావు, వేమా శివకోటి, వేల్పుల రమేష్ పాల్గొన్నారు.

ఊరచెరువు పనుల పరిశీలన

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఊరచెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఊరచెరువు అభివృద్ధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ జగ్గయ్యపేట ఊరచెరువుఅభివృద్ధికి ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారన్నారు. అందుకు ప్రభుత్వంతోపాటు జగ్గయ్యపేట సమీపంలోని ఆయా కంపెనీలు సహకరిస్తున్నట్లు వివరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, తుమ్మేపల్లి నరేంద్ర, కాటగాని నరసింహారావు, మున్సిపల్ డీఈ, ఏఈలు శివకోటేశ్వరరావు, హనుమంతరావు ఉన్నారు.

ఫీల్డ్‌అసిస్టెంట్ నియామకంపై హర్షం



కంచికచర్ల : మండలంలోని పేరకలపాడులో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా కందుల భవాని నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా నీటియాజమాన్య సంస్థ సంచాలకులు జే సునీత ఉత్తర్వులు జారీ చేశారు. ఫీల్డ్‌అసిస్టెంట్ భర్తీకి సహకరించారంటూ నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్‌లను పేరకలపాడు గ్రామనాయకులు గురువారం కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు వేమవరపు పురుషోత్తం, వైఎస్సార్‌సీపీ నాయకులు మర్రి వరప్రసాద్, గోపిదేశి పున్నయ్య, కందుల అశోక్‌కుమార్, పెసరమల్లి పున్నారావు, కందుల రామకృష్ణ, బొబ్బెళ్లపాటి శ్రీకాంత్, కందుల వినయ్, కందుల హజరయ్య, పెసరమల్లి వెంకటకృష్ణ, సొంగా రాజేష్ పాల్గొన్నారు.



విజేత జట్టుతో విప్ సామినేని ఉదయభాను, తాత్వికులు చిట్టా లక్ష్మీనరసింహశాస్త్రి, నాయకులు

క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి

జగ్గయ్యపేట అర్బన్: క్రీడలు శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసంతోపాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో గ్రౌండ్‌లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్దార్ సామినేని విశ్వనాథం, పద్మావతి మెమోరియల్ నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీలు గురువారంతో ముగిశాయి. బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమానికి విప్ ఉదయభాను ముఖ్యఅతిథిగా హాజరై, విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈసందర్భంగా విప్ ఉదయభాను మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిస్తే స్పోర్ట్స్ కోటా కింద ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు పొందవచ్చన్నారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను అభినందించారు. ఈ క్రికెట్ పోటీల్లో జేపీటీ ఎస్‌జీఎస్ లెవెన్, ఎస్‌యూబీ లెవెన్, ఏఆర్ఎఫ్‌సీసీ లెవెన్ జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచాయి. విజేత జట్లకు వరుసగా రూ.40వేలు, రూ.25వేలు, రూ.15వేలను నగదు బహుమతులుగా అందజేశారు. గాయత్రీ ఆశ్రమం వ్యవస్థాపకులు తాత్వికులు చిట్టా లక్ష్మీనరసింహశాస్త్రి షీల్డ్‌లు, మెడల్స్ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, యూత్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తన్నీరు నాగేంద్ర, పట్టణ యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, ఎస్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి బద్దూనాయక్, నాయకులు అల్లూరి భాస్కర్, గుంజ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ట



ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న గ్రామస్తులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, నాయకులు

వీఅన్నవరం(వీరులపాడు): మండలంలోని వీఅన్నవరం గ్రామం గురువారం జైశ్రీరామ్, జైహనుమాన్ నామస్మరణలతో మార్మోగింది. గ్రామంలో వేంచేసియున్న ప్రసన్నాంజనేయ స్వామి వారి జీవధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. వేలాది మంది భక్తుల శ్రీరామ నామస్మరణ నడుమ నిర్వాహకులు స్వామివారి జీవధ్వజ ప్రతిష్ఠ చేశారు. ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం భారీ అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు..

ధ్వజ స్తంభ ప్రతిష్ఠా కార్యక్రమానికి నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు ఆయనకు ఆశీర్వచనం అందజేశారు. ముందుగా ఆలయ అర్చకులు, నిర్వాహకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ జీవధ్వజ స్తంభ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్ఠకు రూ.2.50లక్షలను విరాళంగా అందించిన లింగంపల్లి వెంకాయమ్మ, సుబ్బారావు దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వల్లాపురి రామకోటేశ్వరరావు, సర్పంచి జమ్ముల వరబాబు, మాజీ సర్పంచి జమ్ముల శేషగిరిరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా లెప్రా సొసైటీ వార్షికోత్సవం



జగ్గయ్యపేట అర్బన్: కుష్టువ్యాధి, హెచ్ఐవీ, బోధకాలు తదితర వ్యాధులతో బాధపడుతున్న వారికి సేవలందిస్తూ వారి సంక్షేమానికి కృషిచేస్తున్న లెప్రా సొసైటీ 35వ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక పేట ప్రభుత్వాస్పత్రి(సీహెచ్‌సీ)లో గురువారం ఘనంగా నిర్వహించారు. లెప్రా సొసైటీ సంస్థ రాష్ట్ర సమన్వయకర్త మామిడి రాధిక మాట్లాడుతూ తమసంస్థ దేశంలో 9రాష్ట్రాల్లో కుష్టువ్యాధి, హెచ్ఐవీ, బోధకాలు వ్యాధిగ్రస్తుల కోసం పనిచేస్తున్నట్లు తెలిపారు. వ్యాధిగ్రస్తులకు స్వయం సంరక్షణ శిబిరాల ఏర్పాటుతోపాటు వారికి మందులు, ప్రత్యేక పాదరక్షలు అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం వత్సవాయి మండలంలోని ఐదుగురు చిరువ్యాపారులకు రూ.10వేల చొప్పున వడ్డీలేని రుణాన్ని అందజేశారు. ఈ వేడుకలను ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆళ్ల హరీష్ ప్రారంభించగా, ఆస్పత్రి హెచ్‌వీ జానకి, నాగరాజు, సుజాత, కోటేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన స్థలశుద్ధి పూజలు



పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మవారి కల్యాణ మహోత్సవానికి సంబంధించి కల్యాణ వేదిక స్థలంలో మూడురోజులుగా జరుగుతున్న స్థలశుద్ధి పూజలు గురువారంతో ముగిశాయి. మూడురోజులుగా గోపూజ, ప్రత్యేక పూజలు హోమాలు అనంతరం పూర్ణాహుతితో ముగించారు. ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈవో కె.రమేష్‌నాయుడు, ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు, పాలకవర్గ సభ్యులు, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.